# శత్రునామ సంకీర్తనం

పరిపూర్ణ జీవితాన్ని ప్రతి వాళ్ళూ కోరుకుంటారు. అది సహజాతి సహజం. భార్య పిల్లలూ, ఆస్థి, హెూదా, స్నేహితులు ఇలా. కాని ఈ లిస్టుకి ఒకళ్ళో ఇద్దరో శత్రువుల్ని గూడా తగిలించమని జీవితంలో బాగా పండిపోయిన ఫ్రెండొకడు మరీ మరీ చెప్పాడు. అప్పుడే జీవితానికి అసలు సిసలైన పరి పూర్ణతట. లేని పక్షంలో చంద్రుడికి మచ్చలాగా, డీలక్సు బస్సుకి అద్దం లేని కిటికీ లాగా వెలితి వెలితేనట. పైగా అదేదో బాషలో శత్రువు అనగా శ్రేయోభిలాషి అని అర్ధమట. అదేం విచిత్రమో గాని ఫ్రెండు ఫిలాసఫీ విన్నాక తీరుబడిగా ఆలోచిస్తే నిజమేననిపిస్తోంది. అజాత శత్రువులకి అంతా వెలితే. ఊళ్ళో వాళ్ళంతా మనకి పాదాభివందనాలు చేస్తుంటే పాత చింతకాయ పచ్చడితో పత్యం తిండి తింటున్నంత వెగటుగా వుంటుంది. మనల్ని చూసో, తల్చుకునో కనీసం ఒకళ్ళిద్దరన్నా కళ్ళెర్ర చేసి, పళ్ళు కొరుక్కపోతే ఆ జన్మకి సార్ధకత వుండదని పిస్తోంది. అంచేత మన బతుకుల్లో కిక్కు, థ్రిల్ కావాలంటే శత్రువుల ఆవశ్యకత ఎంతయినా వుంది.

రామాయణ, భారతాన్ని తీసుకున్నా శత్రువు గొప్ప తనం అర్ధమౌతుంది. రావణాసురుడే లేకపోతే రాముడి బల పరాక్రమాలు మనకు తెలిసేవే కావు. అలాగే రావణాసురుడు కూడా రమాభక్తుడయ్యి జై శ్రీరామ్ అనిగాని అనుంటే రామాయణం మనకుండేది కాదు. దుర్యోదనుడు , దుష్టబుద్ది లేకపోతే భారత యుద్దం లేనే లేదు. అంచేత శత్రుత్వం , విరోధం సృష్టిలో భాగాలు, ప్రకృతి సహజాలు, మన సినిమాల్లో గూడా విలన్సులంటేనే హీరోకి రాణింపు, వాళ్ళు లేకపోతే హీరోకి రొమాన్స్ మినహా వేరే పనే వుండదు. ఉజ్జోగం సజ్జోగం లేనివాడు తీరుబడిగా పిల్లల్ని కన్నంత అసహ్యం వేస్తుంది. అంచేత హీరో హీరోనే , విలన్ ! సినిమా కథకి రెండు కళ్ళు లాంటివాళ్ళు. ఆ రెండు కళ్ళల్లో ఏ కన్నుకి నీరు కారినా నలిగిపోయేది నిర్మాతే !.

శత్రుత్వాల్లో రకాలున్నాయ్. తాత్కాలికం, శాశ్వత శత్రుత్వాలు, అకారణ శత్రుత్వాలు, అకాల శత్రుత్వాలు వగైరాలని, బస్సులో కాలు తొక్కాడనో, రైల్లో రెండు సీట్లు ఆక్రమించాడనో , సినిమా హాల్లో ముందు కూర్చున్న మనకన్నా పొడుగాటి వాడు తగ్గి కూర్చోమంటే కుదరదు పొమ్మన్నాడనో పోట్లాటకి దిగుతాం. ఆ ప్రయాణం ఈ సినిమా

పూర్తిగానే అన్ని మర్చిపోతాం. ఇలాంటివి తాత్కాలిక శత్రువులు, ఇహ పిల్లనిస్తున్న మామగారితో పెళ్ళి పందిట్లోనే పేచీ ప్రారంభం అయితే అది లగ్గంతో పోనేపోదు. వెంటాడుతునే వుంటుంది. పండక్కు రమ్మంటే రాను పోమ్మంటారు. సాక్షాత్తు ఆయనే వస్తే మీరు వీధిలోకి తప్పుకుంటారు. పిల్లలు పుట్టినా ఏళ్ళు గడుస్తున్నా లగ్గం రోజు గొడవ గుర్తొచ్చి మిమ్మల్ని రెచ్చగొడుతూనే వుంటుంది. ఆఖరికి మావగారి మాసికం బోజనం చేస్తున్నా వార్ని క్షమించరు. ఇలాంటివి శాశ్వత శత్రుత్వాలు అలాగే అకారణ శత్రుత్వాలని తెస్తుంటాయ్. ఒకానొక మనిషి మిమ్మల్ని చూడంగానే కన్నెర్ర చేసి పళ్ళు పట పట లాడించేస్తుంటారు . కారణం మీకు తెలీదు. వాడు చెప్పడు. మీకు మీరు కారణం కోసం ఆలోచించి. అంతు బట్టక ఆ వ్యక్తిని పలకరిస్తారు. అతను చాలా కోపంతో ' ఛీ నీతో మాట్లాడటమే మహా పాపం ' అంటూ చక్క పోతాడు. మీ జీవిత కాలంలో ఆ శత్రుత్వానికి కారణం తెలీదు. వీటినే అకారణ శత్రుత్వాలని అంటుంటారు. కాలం కాని కాలంలో రాకూడని మనిషితో శత్రుత్వం ఏర్పడితే అదో పెద్ద శాపం భరించలేం. ఇల్లంతా బంధువులు దిగి దిగగానే ఇంటి ఇల్లాలు అలక పాన్పెక్కి కూర్చుంటే భరించటం కష్టం. అలాగే ప్రొమోషన్ రావాల్సిన తరుణంలో ఆఫీసరు గారితో విరోధం వస్తే అదీ శాపమే. ఇవన్నీ అకాల శత్రుత్వాలు. సకాలంలో వస్తే దేన్నయినా భరించవచ్చు. అకాలంలో గాని ప్రాప్తిస్తే తట్టుకోలేం. అయినా శత్రువంటే ఎవడు ? మన మార్గానికి ఎదురొచ్చేవాడు. వాడ్ని ఎదిరించి యుద్ధం చేసి గెలవటమా ? లేక తలవొంచుకుని తప్పుకుపోవడమా అనేది ఎవరికి వారు తేల్చుకోవాల్సిన సంగతి. ఆ సంగతి తేలేదాకా జాగ్తీ రహెూ ! పారా హుషార్ !

------- అయ్యిపోయింది -------